క్లుప్తంగా

బాలలు స్వేచ్ఛగా ఎదగాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటరావు

కాకినాడ రూరల్: బాలల పసితనాన్ని పరిరక్షిస్తూ, వారు స్వేచ్ఛగా, ఆరోగ్యకరమైన వాతావరణంలో ఎదగడానికి పెద్దలు తగిన అవకాశం కల్పించాలని జిల్లా బాలల సంక్షేమ అధికారి సీహెచ్.వెంకటరావు అన్నారు. అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేటలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సినిమా టీవీల పేరిట అమ్మాయిలను కొందరు మభ్యపెట్టి మోసగిస్తున్నారని చెప్పారు. మహిళల అక్రమ రవాణాలో చిన్న పిల్లల నుంచి 18 ఏళ్ల అమ్మాయిలు 70 శాతానికి పైగా ఉన్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎందరికో ఆసరాగా రౌండ్ టేబుల్ ఇండియా



గౌరవ సభ్యునిగా బాధ్యతలు స్వీకరించాక సభ్యులతో సంకురాత్రి చంద్రశేఖర్

బోట్‌క్లబ్: రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో మంది నిరుపేదలకు ఆసరాగా ఉంటున్నాయని పద్మశ్రీ అవార్డు గ్రహీత సంకురాత్రి ఫౌండేషన్ చైర్మన్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక జీఆర్టీ గ్రాండ్ హోటల్‌లో బుధవారం రాజమండ్రి రౌండ్ టేబుల్ 381 ట్రస్ట్ వార్షిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ చంద్రశేఖర్‌కు ట్రస్ట్ గౌరవ సభ్యునిగా సభ్యత్వం అందించారు. రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ విద్య, వైద్యం కోసం ఎంతగానో సేవలందిస్తోందన్నారు. వారు చేపట్టే దీర్ఘకాల ప్రాజెక్టులు ఆకట్టుకుంటున్నాయన్నారు. యువకులైన పారిశ్రామిక వేత్తలు, వివిధ రంగాల నిపుణులు కలిసి సమాజ హితానికి కృషి చేయడం గొప్ప విషయమన్నారు. ఈ సంస్థలో తన వంతు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. సంకురాత్రి చంద్రశేఖర్ గౌరవ పదవిని అలంకరించడం తమకెంతో గర్వకారణమని సంస్థ పబ్లిక్ రిలేషన్స్ కన్వీనర్ వల్లూరి సత్యశ్రీరామ్ తెలిపారు. అనంతరం చంద్రశేఖర్‌ను సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు టి శ్రీనివాస్ రాజు, గన్ని సందీప్, తరుణ్‌చౌదరి, మేకా సతీష్ పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలంలో నిర్మాణ పనుల నిలిపివేత



పనులు నిలిపి వేస్తున్న పంచాయతీ కార్యదర్శి చంద్రకళ

కరప: పెనగుదురులో పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి, షాపు నిర్మిస్తున్న పనులను పంచాయతీ కార్యదర్శి అడ్డుకున్న ఉదంతమిది. వివరాల్లోకి వెళితే, పెనుగుదురులోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని అనుకుని కొంత పంచాయతీ స్థలం ఉంది. దీనిపై అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి కన్ను పడింది. దానిని కాస్తా ఓ వ్యక్తికి అమ్మేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఆ స్థలంలో షాపు నిర్మాణం కోసం బుధవారం పునాది గోతులు తవ్వారు. ఇసుక, కంకర సామగ్రి కూడా తరలించారు. ఈ మేరకు ఫిర్యాదు అందుకున్న పంచాయతీ కార్యదర్శి బి.చంద్రకళ అక్కడకు చేరుకున్నారు. షాపు నిర్మాణ పనులను నిలిపివేశారు. దీనిపై ఆమెను వివరణ కోరగా, స్థలాన్ని ఆక్రమించుకున్న వారికి నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. అక్కడ ఏ విధమైన నిర్మాణం చేపట్టకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కాకినాడ: దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులు బుధవారం కమిషనర్ భావనను కోరారు. ఈ మేరకు ఉద్యోగుల సంఘ ప్రతినిధులు కమిషనర్‌ను కలిసి సమస్యలపై చర్చించారు. సంఘ గౌరవాధ్యక్షుడు పలివెల వీరబాబు, అధ్యక్షుడు కె.సత్తిరాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నగరపాలక సంస్థలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులకు గుమస్తాలుగా, బిల్లు కలెక్టర్లుగా పదోన్నతులు దక్కడం లేదన్నారు. అలాగే ఆదివారం, సెలవు దినాల్లో పనిచేసినప్పుడు మరో తేదీన సెలవు ఇవ్వాలని కోరారు. ఆయా సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని సంఘ ప్రతినిధులు చెప్పారు. సంఘ నాయకులు ఎం.సత్తిరాజు, పి.భవాని, ఎ శ్రీనివాస్, వి.దుర్గారావు, ఐవీ దుర్గారావు, కమలహాసన్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ ఊసే లేదు



కోల్‌కతా వైద్య విద్యార్థిని హత్యాచారం ఘటనతో వైద్యులకు పని వేళల్లో ఉంటున్న భద్రత ఏపాటిదో తేటతెల్లమైంది. దేశవ్యాప్తంగా నిరాటంకంగా నిరసనలు జరుగుతున్నా, కేసును ఎలా నీరు గార్చి, దోషులను తప్పించాలనే ధ్యాసే మినహా, సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ రూపకల్పన, 11/2008 వంటి అమలులో ఉన్న చట్టాల పటిష్టత ఊసే లేదు. ఈ దుస్థితే వైద్యులను అభద్రతలోకి నెట్టుతోంది. నేరం చేసి దాక్కున్న వారు, వారిని దాస్తున్న వారు కచ్చితంగా వైద్య విద్యార్థిని హత్యకు మూల్యం చెల్లించక తప్పదు.

– డాక్టర్ సౌజన్య, పీజీ ఆర్థోపెడిక్స్, ఆర్ఎంసీ

వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉంది



ఇటీవల కోల్‌కతా ఆస్పత్రిలో జరిగిన విషాదకర సంఘటన మనందరినీ తీవ్రంగా కలిచివేసింది. ఇలాంటి ఘటనలు మన సమాజంలో పాతుకుపోయిన పురుషాధిక్యతను స్పష్టంగా చూపిస్తున్నాయి. స్త్రీలను గౌరవించడం, సమానత్వాన్ని పాటించడం ఎంత ముఖ్యమో మగవారికి నేర్పించాలి. స్త్రీలను చిన్న విషయాలపై విమర్శించడం మానుకుని, పురుషాధిక్య వ్యవస్థను మార్చడానికి ప్రయత్నించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– డాక్టర్ శ్రీవల్లీ, కాస్మోటిక్ ఎండోడాంటిస్ట్, కాకినాడ

ఇదిగో.. నాలుగో సింహం

- తోడూనీడగా ట్రాఫిక్ పోలీస్
- వృద్ధులు, రోగులు, అన్నార్తులకు అండ
- ప్రమాదాల నివారణకు రోడ్ల మరమ్మతులు
- విధి నిర్వహణతో పాటు సేవా పథం
- ఆదర్శంగా కాకినాడ ట్రాఫిక్ పోలీసులు

కరకుగా ఉండే మనస్తత్వానికి మారు పేరే పోలీసు అనుకోవడం సహజం. వారి వద్దకు వెళ్లాలంటేనే ఏదో తెలియని భయం. ఇది ప్రజల్లో ఉన్న ఓ అపోహ మాత్రమే. పోలీసుల్లో ఉండే దయాగుణం, సేవా భావం అంతా ఇంతా కాదని నిరూపిస్తున్నారు కాకినాడ ట్రాఫిక్ పోలీసులు. తమ విధులు నిర్వర్తిస్తూనే, ప్రజోపయోగ, సమాజహిత కార్యకలాపాల్లో భాగస్వాములవుతూ అందరి మన్ననలు అందుకుంటున్నారు.



క్షతగాత్రుడిని ఆటోలో తరలిస్తున్న ట్రాఫిక్ పోలీస్

కాకినాడ క్రైం: కాకినాడ ట్రాఫిక్ పోలీస్ విభాగం కీర్తి ప్రతిష్టలను మూటగట్టుకుంటోంది. అందుకు విధులతో పాటు, సేవా పథాన్ని మార్గంగా ఎంచుకుంది. ట్రాఫిక్ సీఐ నూనె రమేష్ సూచనల మేరకు, ఆయన ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ యంత్రాంగం ఈ మహత్కార్యానికి శ్రీకారం చుట్టింది. విధుల్లో ఉంటుండగా.. కనిపించే ప్రతి సమస్య పరిష్కారంలోనూ ట్రాఫిక్ పోలీస్ ప్రమేయం ఉండాలన్నదే లక్ష్యమనీ, విధులకు సమాంతరంగా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నామని పోలీసులు అంటున్నారు.

ఏం చేస్తున్నారు...

తమ ఎదుట ఎదురయ్యే అన్ని సమస్యల్లోనూ ట్రాఫిక్ పోలీసులు బాధితులు లేదా అర్తులకు తోడూనీడగా నిలుస్తున్నారు. ఆస్పత్రుల ఆవరణల్లో, రోడ్లు దాటేందుకు ఇబ్బంది పడుతున్న రోగులు, నర్సులు, నర్సింగ్, వైద్య విద్యార్థులను దగ్గరుండి రోడ్లు దాటిస్తున్నారు. దివ్యాంగులు ఎటువంటి ప్రమాదాల బారిన పడకుండా, భుజం కలిపి తోబుట్టువుల్లా ధైర్యం చెబుతున్నారు. ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి అవుతున్న వారు నీరసంతో వాహనాల కోసం ఎదురు చూస్తుంటే, వారిని దగ్గరుండి మరీ ఆటోలు, బస్సులు ఎక్కిస్తున్నారు. గుంతలు పడిన రహదారులు ప్రమాదాలకు కారణమవుతుంటే, అందరిలా కాకినాడ ట్రాఫిక్ పోలీసులు మాత్రం చూస్తూ ఉండడం లేదు. సీఐ రమేష్, ఆయన బృందం భవంతుల శిథిలాలు తరలించి, గుంతలు పూడ్చి ప్రమాదాలను నివారిస్తున్నారు. ఇందుకు వారి జేబుల్లో డబ్బు కూడా ఖర్చు చేస్తున్నారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆకలితో అలమటిస్తున్న నిరుపేద రోగుల సహాయకులకు ఆర్థిక సాయాన్ని కూడా చేస్తున్నారు.

అంబులెన్స్ కంటే ముందుగా..

అలాగే రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు 108, అంబులెన్సుల కోసం ఎదురుచూడకుండా, తమ సొంత వాహనాలు లేదా అటుగా వెళుతున్న వాహనాలను ఆపి మరీ క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలిస్తున్నారు. అంబులెన్సుల కంటే ముందుగా ట్రాఫిక్ పోలీస్ బాధితులను చేరుకుంటున్నాడు. అటువంటి ఘటన ఒకటి బుధవారం కాకినాడలోని భానుగుడి కూడలిలో జరగగా, ట్రాఫిక్ ఎస్సై రత్నం ఆయన బృందం బాధితుడిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించి, సకాలంలో వైద్యం అందేలా చేశారు.



గుంతలు పడ్డ రహదారిని పూడ్చేందుకు సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ రమేష్



వృద్ధురాలిని రోడ్డు దాటిస్తున్న ట్రాఫిక్ ఎస్సై

ఎందుకిలా..

విధి నిర్వహణతో సరిపెట్టే అవకాశం ఉండి కూడా సేవ చేయాలనే ఆలోచన ఎందుకని సీఐని అడిగితే, ఆసక్తికర, ఆదర్శవంత సమాధానం వచ్చింది. ప్రజల్లో అన్ని వేళలా, సమాజంలో అన్ని చోట్ల ఉండేది ట్రాఫిక్ పోలీసులేనని, అటువంటి వారికి అనేక స్థానిక సమస్యలు ఎదురవ్వడమే కాక, ఎందరో వివిధ కారణాలతో ఇబ్బంది పడుతున్న వారు కంటపడతారన్నారు. అటువంటి వారికి తమవంతు బాధ్యతగా సాయం అందించేందుకు అదనపు సమయం ఏదీ వెచ్చించాల్సిన అవసరం లేదని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటే చిన్నపాటి సాయాలు అందించడం విధులకు కూడా ఆటంకం కాదన్నారు. తమ సిబ్బంది కూడా సేవా మార్గంలో పయనిస్తూ, ఆదర్శవంతులుగా తమ విధి నిర్వహణలో రాణిస్తున్నారని సీఐ రమేష్ తెలిపారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ సహా, ఉన్నతాధికారుల అనుమతి పొందడమే కాక,, వారి అభినందనలు, ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నామని రమేష్ అన్నారు.

సేవా మార్గంలో వంద మంది

కాకినాడ ట్రాఫిక్ విభాగం రెండు స్టేషన్లుగా కొనసాగుతోంది. ట్రాఫిక్–1, ట్రాఫిక్–2 పరిధిలో మొత్తం 100 మంది పోలీసులు పనిచేస్తున్నారు. వీరిలో 70 మంది కానిస్టేబుళ్లు కాగా, మిగిలిన 30 మందిలో హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైలు, ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. నగరాన్ని 50 బీట్లుగా విభజించిన ట్రాఫిక్ విభాగం, ఆయా బీట్లలో సేవలందిస్తోంది. ఎక్కడ, ఏం జరిగినా అది కచ్చితంగా ట్రాఫిక్ పోలీస్ దృష్టికి వస్తుంది. సరిగ్గా ఇదే విశ్లేషణ, తమ సేవా స్ఫూర్తికి శ్రీకారమని సీఐ రమేష్ అన్నారు.

ఆదర్శవంత ఆలోచన



కాకినాడ ట్రాఫిక్ విభాగానిది ఓ ఆదర్శవంతమైన ఆలోచన. సరికొత్తగా ఆలోచించి అమలు చేస్తున్న ట్రాఫిక్ సీఐ రమేష్‌కు, ఆయన ఆధ్వర్యంలోని బృందానికి ప్రత్యేక అభినందనలు. ఇటువంటి చర్యలతో పోలీసులపై ప్రజల్లో అపార నమ్మకం ఏర్పడుతుంది. ట్రాఫిక్ పోలీసులు కేవలం వారి విధులకే పరిమితం కాక, సేవా గుణాన్ని అలవర్చుకోవడం హర్షణీయం. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ప్రజల మద్దతులో ఇటువంటి సరికొత్త, ప్రజా ప్రయోజన ఆలోచనలు మరిన్ని అమలయ్యేలా చర్యలు చేపడతాం.

– విక్రాంత్ పాటిల్, ఎస్పీ, కాకినాడ జిల్లా

చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం



కరప నీలయ్యతోట వీధిలో పందిరిరాట పూజలు చేస్తున్న సభ్యులు

కరప: గణపతి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో స్థానిక నీలయ్యతోటవీధి కన్నబాబుకాలనీలో సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో బుధవారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఏటా ఇక్కడ నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. తొలుత భూమిపూజ చేసి, పందిరి రాట వేశారు. సిద్ధి వినాయక యూత్ ప్రతినిధులు ముద్రగడ నానాజీ, తుమ్మలపల్లి సత్తిబాబు, కె.వీర్రాజు, కె.పాండవులు, పి.రామకృష్ణ, సీహెచ్ సత్యనారాయణ, దేవు దుర్గారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద కొత్తూరు, పెనుగుదురు, పెద్దాపురప్పాడు, కరప తదితర గ్రామాల్లో పందిరి రాట ముహూర్తం చేసి, ఉత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో పలువురికి జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరుపర్చగా, ఒకరికి 4, మరొకరికి ఒకటి, ముగ్గురికి రెండు రోజుల వంతున జైలు, 11 మందికి రూ.10 వేల వంతున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

నెలాఖరు కల్లా సీసీఆర్‌సీ, ఈ–క్రాప్ పూర్తి చేయాలి



కరపలో సమీక్ష జరుపుతున్న తహసీల్దార్, ఎంపీడీ

కరప: కౌలు గుర్తింపు కార్డులు(సీసీఆర్‌సీ) ఈ నెలాఖరుకు మంజూరు, ఈ–క్రాప్ నమోదు నూరు శాతం పూర్తి చేయాలని తహసీల్దార్ పిండి వెంకటగోపాలకృష్ణ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం వీఆర్వోలు, వీఏఏలు, ఏఈఓలతో సమావేశం జరిగింది. ఎంపీడీ ఏవీ రాజేష్‌తో కలిసి ఆయన వివధ అంశాలపై సమీక్షించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వం ఇచ్చే పరిహారం కౌలు రైతులకు కూడా అందాలంటే తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డులు ఉండాలన్నారు. ప్రభుత్వమిచ్చే రాయితీలు పొందాలన్నా, పండించిన పంటను మద్దతు ధరకు అమ్మాలన్నా రైతులు, కౌలు రైతుల పేరిట ఈ–క్రాప్ నమోదై ఉండాలన్నారు. రైతులు, కౌలు రైతులకు ఇబ్బందులు లేకుండా, నిర్దేశిత లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. మండలంలో సీసీఆర్‌సీ కార్డులు 4,900 మంది కౌలు రైతులకు ఇవ్వాల్సి ఉండగా, 4,367 మందికి ఇచ్చామన్నారు. 14,026 ఎకరాలకు ఇంతవరకు 11,120 ఎకరాల్లో ఈ–క్రాప్ నమోదు పూర్తి చేశారన్నారు. సీసీఆర్‌సీ కార్డుల పంపిణీలో ఇబ్బందులు తలెత్తితే, రైతులకు 11 నెలల కాల పరిమితికి కౌలు కార్డులు ఇస్తున్నట్టు చెప్పారు. దీనివల్ల సొంత భూమి ఉన్న రైతులకు చట్టపరంగా సమస్యలు ఉండవన్నారు. తర్వాత తహసీల్దార్ వెంకటగోపాలకృష్ణ, మండల సర్వేయర్ ఈ.రామకృష్ణ, ఆర్ఐ పేపకాయల మాచరావులు వీఆర్వోలు, సర్వేలతో సమావేశమై, మండలంలోని శ్మశానవాటికలు లేని, డంపింగ్ యార్డులు లేని గ్రామాలను గుర్తించి, అక్కడ అవసరమైన స్థలాల సమీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రభుత్వ స్థలాలు లేకపోతే, ప్రైవేటు వ్యక్తుల నుంచి మార్కెట్ రేటు ప్రకారం భూమిని సేకరించాలని తహసీల్దార్ వెంకటగోపాలకృష్ణ సూచించారు.

ఈవీఎంలపై అనుమానాలు నివృత్తి చేయాలి

బోట్‌క్లబ్: ప్రజల్లో ఈవీఎంలపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేయడంలో ఎన్నికల కమిషన్ వైఫల్యం చెందడం ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకం కోల్పోయేలా ఉందని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమానం ఉన్న చోట వీవీ ప్యాట్లను లెక్కించే ప్రక్రియ అమలు చేస్తే అనుమానాలకు తావుండదన్నారు. విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని ఈవీఎం గోదాం వద్ద పోలింగ్ రోజు వినియోగించిన బ్యాటరీ స్టేటస్ వీవీ ప్యాట్ల లెక్కింపుతో పాటు, సీసీ ఫుటేజ్‌ను బహిరంగం చేయాలన్నారు. పోలింగ్ 81.06 శాతం జరిగిందని చెప్పి, మరుసటి రోజు 99 శాతం చూపడంపై సందేహాలు ఏర్పడ్డాయన్నారు. వీవీ ప్యాట్ల స్లిప్పులను బర్న్ చేశామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రా, ఒడిశాతో పాటు, అనేక రాష్ట్రాల్లో పోలింగ్ శాతంపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పూర్తిగా ఎన్నికల సంఘానిదేనని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నియంతృత్వ పోకడలు ఇదేవిధంగా కొనసాగితే భారత ప్రజాస్వామ్యం ప్రపంచ దేశాల్లో చులకనయ్యే దుస్థితి ఉందన్నారు.

యూటర్న్ తీసుకుంటున్న టీడీపీ

- సీఐటీయూ నేతల మండిపాటు
- విద్యుత్ అమరవీరులకు నివాళులు



విద్యుత్ పోరాట అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

కాకినాడ సిటీ: విద్యుత్ ధరల విషయంలో టీడీపీ నేతలు యూటర్న్ తీసుకుంటున్నారని పలువురు సీఐటీయూ నాయకులు ధ్వజమెత్తారు. విద్యుత్ ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా 2000లో జరిగిన ప్రజా పోరాటంలో పోలీసు తూటాలకు బలైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామికి బుధవారం సీఐటీయూ భవనం వద్ద నివాళులర్పించారు. విద్యుత్ సంస్కరణల్లో భాగంగా స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించాలని ప్రజలకు వక్తలు పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, మలకా రమణ మాట్లాడారు. విద్యుత్ ఉద్యమం ఫలితంగా 15ఏతో పాటు, ఏ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా విద్యుత్ ధరలు పెంచేందుకు సాహసించలేదన్నారు. ఈ విద్యుత్ పోరాటం సందర్భంగా అప్పటి టీడీపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు సీఐటీయూ కార్యకర్తలు అమరులయ్యారన్నారు. గత ప్రభుత్వంలో విద్యుత్ ధరల పెరుగుదలను వ్యతిరేకించిన అప్పటి ప్రతిపక్ష టీడీపీ నాయకులు.. నేడు అధికారంలోకి వచ్చిన రెండు నెలలు గడవక ముందే యూటర్న్ తీసుకుని, ప్రజలపై విద్యుత్ భారాలు మోపేందుకు సిద్ధపడ్డారని విమర్శించారు. అదాని కంపెనీ నుంచి స్మార్ట్ మీటర్లు రాష్ట్రానికి చేరుకున్నాయన్నారు. ప్రయోగాత్మకంగా ఒడిశా, బీహార్ రాష్ట్రాల్లో బిగించిన స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేయడాన్ని గుర్తు చేశారు. వీటివల్ల విద్యుత్ ధరలు పెరగడమే కాకుండా, రైతుల 9 గంటల ఉచిత విద్యుత్‌కి మంగళం పాడబోతున్నారన్నారు. వేలాది మంది మీటర్ రీడర్ల ఉపాధి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం స్మార్ట్ మీటర్ బిగింపు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు చంద్రమళ్ల పద్మ, ఎరుబండి చంద్రావతి, టి రాజా, మేడిశెట్టి వెంకటరమణ, దడాల పద్మ, దాడి బేబీ, వడ్డి ఎస్తేరురాణి, సునీత, తులసి పాల్గొన్నారు.

దివ్యాంగుల డిజిటల్ విద్యపై శిక్షణ



రిసోర్స్ పర్సన్లకు శిక్షణ ఇస్తున్న కీరిసోర్స్ పర్సన్

కాకినాడ సిటీ: దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించి, వారిలో అభ్యసన నైపుణ్యాలను పెంపొందించే అంశంపై సహిత విద్య రిసోర్స్‌పర్సన్లకు బుధవారం కలెక్టరేట్‌లోని విధాన గౌతమి కాన్ఫరెన్స్ హాలు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించారు. ట్యాబ్‌ల వినియోగంపై ఐఈఆర్‌పీలకు శిక్షణ ఇచ్చారు. జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్రశిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ పి.రమేష్, రాష్ట్ర సమగ్రశిక్షా ఐఈ కన్సల్టెంట్ పరిశీలకుడు వై.నరసింహం, రాష్ట్ర సహిత విద్య సహాయ సమన్వయకర్త డాక్టర్ ఎస్ అమ్మినాయుడు మాట్లాడారు. డిజిటల్ విద్యను అందించడంలో, దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తోందని చెప్పారు. దివ్యాంగుల్లో అభ్యాసన ఫలితాలు రాబట్టేందుకు దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసిందన్నారు. ఇందులో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో పాటు, 33 రకాల యాప్‌లను ఉంచడం వల్ల దివ్యాంగులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని జిల్లా సహిత విద్య సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు పర్యవేక్షించారు. డిజిటల్ విద్యపై రాష్ట్ర కీరిసోర్స్ పర్సన్లుగా బి.మహాలక్ష్మీ నాయుడు, పి.సునీల్‌కుమార్ వ్యవహరించారు.

2 నుంచి యానిమేటర్ల రిలే దీక్షలు



డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న యానిమేటర్లు

కాకినాడ సిటీ: రాజకీయ తొలగింపులు ఆపాలని, బకాయి పెట్టిన ఆరు నెలల వేతనాలు తక్షణం చెల్లించాలని కోరుతూ సెప్టెంబర్ రెండు నుంచి డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద యానిమేటర్లు రిలే దీక్షలు చేపట్టనున్నట్టు సీఐటీయూ అనుబంధ ఏపీ వెలుగు వీఓఏ ఉద్యోగుల సంఘం ప్రకటించింది. ఈ సందర్భంగా బుధవారం డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట సంఘ సభ్యులు ధర్నా నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షురాలు కందా గంగాభవాని విలేకర్లతో మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా పని చేస్తున్న యానిమేటర్లను వైఎస్సార్‌సీపీ అభిమానులుగా ముద్ర వేసి, ఉద్యోగాల నుంచి తొలగిస్తూ, ఆ పోస్టులను టీడీపీ నాయకులు తమ కార్యకర్తలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సెర్ప్ అధికారుల ఆదేశాలు లేకుండా, గ్రామ సభ తీర్మానం కానీ, ముందస్తు నోటీసు కానీ ఇవ్వకుండా, కేవలం కూటమి నాయకుల ఆదేశాల మేరకు జిల్లాలో యానిమేటర్ల తొలగింపులు జరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టాల్సిన అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారని విమర్శించారు. తక్షణం తొలగింపు ఆపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీఆర్‌డీఏ మేనేజర్ అశోక్‌భరత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, వీఓఏ సంఘ నాయకులు ఈశ్వరి, అమ్మాజీ, సత్యవేణి, రాణి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్ విష్ణు

కాకినాడ రూరల్: తెలిసి తెలియకో చేసే తప్పిదాల వల్ల విద్యార్థులు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని జిల్లా లా అండ్ ఆర్డర్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రఘువీర్ విష్ణు అన్నారు. యాంటీ ర్యాగింగ్, డ్రగ్ అబ్యూస్, ఆల్కహాలిజం –2024–25 అనే అంశంపై బుధవారం కాకినాడ ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి రఘువీర్ విష్ణు మాట్లాడుతూ మత్తు పదార్థాలు ఉన్నత విలువలు, లక్ష్యాలు గల విద్యార్థి భవిష్యత్తును తునాతునకలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఎలక్యూషన్, డిబేట్, పోస్టర్ ప్రజెంటేషన్ వంటి పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, మాణిక్యరెడ్డి హెల్త్ సర్వీసెస్ సమర్పించిన సర్టిఫికెట్లను విద్యార్థులకు అందజేశారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్ ప్రశాంతిశ్రీ, సీనియర్ అడ్వకేట్ జనాబ్ సయ్యద్ సలార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

కాకినాడ క్రైం: ట్రాఫిక్ నియమాలపై కాకినాడ ట్రాఫిక్ విభాగం విద్యార్థులకు అవగాహన కల్పించింది. ట్రాఫిక్ సీఐ నూని రమేష్ ఆయన బృందంతో కలిసి స్థానిక పీఆర్ జూనియర్ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని తెలిపారు. మోడిఫైడ్ సైలెన్సర్లను వినియోగిస్తే జరిమానా తప్పదన్నారు. మద్యం తాగి, మితిమీరిన వేగంతో వాహనం నడిపితే ప్రమాదాలు వాటిల్లుతాయన్నారు. బైక్ స్టంట్లు, చట్ట విరుద్ధంగా నంబర్ ప్లేట్లు మార్చడం నేరమన్నారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

రాత్రి 10 వరకే భారీ వాహనాలకు అనుమతి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవులు

కాకినాడ క్రైం: నగరంలో ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకే భారీ వాహనాలకు అనుమతి ఉందని డీఎస్పీ రఘువీర్ అన్నారు. బుధవారం స్థానిక వార్ఫ్ రోడ్‌లో ఛాంబర్ ఆఫ్ కామర్స్, లారీ ఓనర్ల సంఘం, మినీ లారీ యూనియన్ ప్రతినిధులతో సమావేశం జరిగింది. డీఎస్పీ రఘువీర్ మాట్లాడుతూ, భారీ వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలపరాదని సూచించారు. నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలపాలన్నారు. అందుకనుగుణంగా యూనియన్ సభ్యులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో సహకరించాలన్నారు. వన్ టౌన్ సీఐ నాగదుర్గారావు, ట్రాఫిక్ సీఐ ఎస్.రమేష్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ వీవీ.రాఘవులు, డైరెక్టర్ పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.